
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.6 కనిష్ఠం 20.0
నిజామాబాద్ జిల్లా వార్తలు
5
శనివారం 20 జనవరి 2024



నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం

నిజామాబాద్ అర్బన్, జనవరి 19: జిల్లాలో శని, ఆదివారం రోజున ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. జిల్లాలో 18ఏళ్లు నిండిన వారందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్ కేంద్రాల వద్ద అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. కొత్త ఓటరు నమోదుతో పాటు ముసాయిదా జాబితాలో ఏవైనా మార్పులు, చేర్పులు ఉంటే ఫారం 7, 8 ద్వారా సరిచేసుకునే విధంగా చూడాలని ఆయన కోరారు. ఓటరు పేరు తప్పిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

యువ ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్


వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, ఇతర అధికారులు



వీసీలో మాట్లాడుతున్న వికాస్‌రాజ్

నిజామాబాద్ అర్బన్, జనవరి 19: రాష్ట్రంలోని యువ ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో ఓటరు నమోదుపై శుక్రవారం సమీక్షించారు. రాష్ట్రంలో ఉన్న 18-19 సంవత్సరాల యువ ఓటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టి వారు ఓటరుగా నమోదు అయ్యే విధంగా చూడాలన్నారు. నేడు, రేపు జరిగే ఓటరు నమోదు కార్యక్రమంలో ఎక్కువ మంది పేర్లు నమోదు చేసుకునే విధంగా చూడాలని కోరారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఫారం-6,7,8 ఉండే విధంగా చూడాలని కోరారు. మార్పులు, చేర్పులు సరిచూడటంతో పాటు డుబ్లికేట్ ఓటర్లు, మృతి చెందిన ఓటర్లు ఇతర వివరాలను చూడాలని కోరారు. జిల్లాలో ఓటరు నమోదు ప్రక్రియ జరిగిన విధానాన్ని ప్రధాన ఎన్నికల కమీషన్‌కు జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు వివరించారు. జిల్లాలో 18 ఏళ్లు నిండిన వారందరిని ఓటరు జాబితాలో చేర్చే విధంగా చూస్తున్నామన్నారు. తుది జాబితాలో ఏ ఒక్క డుబ్లికేట్ పేర్లు ఉండకుండా పరిశీలన చేస్తున్నామన్నారు. గుర్తింపు కార్డుల కోసం వెంటనే చర్యలు తీసుకునే విధంగా అధికారులను ఆదేశించామని తెలిపారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈనెల 25న జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా విస్తృతస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చిత్రమిశ్ర, యాదిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, వినోద్‌కుమార్, రాజాగౌడ్, భుజంగరావు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



అధికారుల బదిలీలకు రంగం సిద్ధం

- ఎంపీ ఎన్నికల నేపథ్యంలో బదిలీలకు కసరత్తు
- ఇప్పటికే వివరాలను సేకరించిన ఉన్నతాధికారులు
- జిల్లాలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న అధికారుల వివరాల సేకరణ
- గత ప్రభుత్వ హయాంలో బ్రాండ్ పడ్డ అధికారులపై ప్రత్యేక నజర్

నిజామాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో దీర్ఘకాలికంగా పనిచేస్తున్న అధికారుల బదిలీకి రంగం సిద్ధమవుతోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడటం, పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో అధికారులు బదిలీ కానున్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న అధికారులు బదిలీ కాగా ప్రస్తుతం ఇతర అధికారులను బదిలీచేసేందుకు ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయిలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న అధికారుల వివరాలను తీసుకోవడంతో పాటు రెగ్యులర్‌గా శాఖలో పనిచేస్తున్న అధికారులపై నజర్ పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో బ్రాండ్ పడ్డ అధికారులు సైతం బదిలీ కానున్నారు. ఈ బదిలీల్లో భాగంగా కొంత మంది అధికారులు కొన్ని నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు జంకుతున్నారు. జిల్లాను విడిచి ఇతర జిల్లాలకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు.

వచ్చే నెలలో ఎన్నికల షెడ్యూల్!

వచ్చే నెలలో పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ రానుంది. ఆ లోపే జిల్లాలో మూడేళ్లకు పైగా పనిచేస్తున్న అధికారులు బదిలీ కానున్నారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పనిచేసే అధికారులను ఇతర జిల్లాలకు పంపించనున్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో 70 శాతానికి పైగా అధికారులు ఇతర జిల్లాలకు బదిలీ కాగా, ప్రస్తుతం మిగతా అధికారులు కూడా బదిలీ కానున్నారు. మండల స్థాయిలో పనిచేసే తహసీల్దార్లు, ఎస్సైలు, సీఐలతో పాటు ఈ దఫా ఎంపీడీవోలను బదిలీ చేయనున్నారు. శాసనసభ ఎన్నికల సమయంలో ఎంపీడీవోలను బదిలీ చేయలేదు. పార్లమెంట్ ఎన్నికల ముందే వీరిని బదిలీచేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

షెడ్యూల్‌కు ముందే బదిలీలు

శాసనసభ ఎన్నికల సమయంలో జిల్లాలో పనిచేస్తున్న హెచ్‌వోడీలను బదిలీ చేయలేదు. జిల్లాస్థాయి అధికారుల్లో రెవెన్యూ, పోలీస్ అధికారులను మాత్రమే బదిలీ చేశారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌కు ముందే జిల్లాలోని కీలక శాఖల అధికారులను బదిలీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 8వ తేదీలోపు మూడేళ్లు సర్వీసు పూర్తి చేసుకున్న అధికారులందరినీ బదిలీ చేయనున్నారు. కొంత మంది అధికారులు గత ప్రభుత్వ హయాంలో కీలకంగా పనిచేశారు. మూడేళ్లకు మించి జిల్లాలో వివిధ శాఖలకు హెచ్‌వోడీలుగా పనిచేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడినందున వీరందరిపై నజర్ పెట్టారు. కొత్త ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసే అధికారులను జిల్లాకు తెచ్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో పనిచేసి బ్రాండ్ పడ్డ అధికారులను పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన లొసుగులకు సంబంధించిన వ్యవహారాల్లో కొంత మంది అధికారుల పాత్ర ఉండటంతో వారిని పంపించేందుకు సిద్ధమవుతున్నారు. గత ఎన్నికల సమయంలో మండల స్థాయిలో పనిచేస్తున్న ఎంపీడీవోలు బదిలీ కాలేదు. వీరిలో ఎక్కువ మంది దీర్ఘకాలికంగా పనిచేస్తున్నారు. కొంత మంది అధికారులు ఒకే మండలంలో పదేళ్లకు పైగా పనిచేస్తున్న వారు ఉన్నారు. వారి వివరాలను తీసుకోవడంతో పాటు ఎన్నికల షెడ్యూల్‌కు ముందే బదిలీ చేసేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు.

దీర్ఘకాలికంగా పనిచేస్తున్న అధికారులపై ఆరా

జిల్లాలో దీర్ఘకాలికంగా డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న అధికారుల వివరాలను కూడా తీసుకున్నట్లు తెలుస్తోంది. కొత్త ప్రభుత్వం డిప్యూటేషన్‌పై వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారుల వివరాలను అందించాలని కోరడంతో జిల్లా అధికారులు వివరాలను పంపించారు. వివిధ శాఖల్లో ఇతర శాఖల అధికారులు డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. మాతృశాఖలో పదోన్నతులు వచ్చిన ఇతర జిల్లాలకు వెళ్లకుండా డిప్యూటేషన్‌పై ఇతర శాఖల్లో చేరారు. ఏళ్ల తరబడి అక్కడే కొనసాగుతున్నారు.

కీలకంగా వ్యవహరించిన అధికారులు

గత ప్రభుత్వ హయాంలో మండల, డివిజన్ స్థాయిలో కొంత మంది అధికారులు కీలకంగా వ్యవహరించారు. అప్పటి ప్రజాప్రతినిధులకు దగ్గరగా పనిచేశారు. వారి సూచనలకు అనుగుణంగా పథకాలను అమలు చేశారు. కొంత మంది మండల స్థాయిలో పనిచేయగా మరికొంత మంది డివిజన్ స్థాయిలో పనిచేశారు. కొంత మంది అధికారులు జిల్లా స్థాయిలో కొనసాగారు. సుమారు తొమ్మిదేళ్ల పాటు ఆ అధికారులు కీలకంగా వ్యవహరించారు. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో అధికారులపై నజర్ పెట్టారు. వారు ప్రస్తుతం ఇతర జిల్లాలకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు.

ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు సన్నద్ధం

జిల్లాలో వివిధ మండలాల్లో పనిచేస్తున్న అధికారులు ప్రస్తుతం ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. కొంత మంది అధికారులు ఇతర నియోజకవర్గాలకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా మరికొంత మంది అధికారులు ఎన్నికల్లో భాగంగా బదిలీ కానుండటంతో ఇతర జిల్లాలకు వెళ్లేందుకు సన్నద్ధమవుతున్నారు. కొత్తగా కాంగ్రెస్, బీజేపీ ఎమ్మెల్యేలు ఎన్నికవడం పాత విషయాలను అడుగుతుండటంతో మండల స్థాయిలో పనిచేసేందుకు అధికారులు జంకుతున్నారు. తహసీల్దార్లు, ఎస్సైలు, ఇతర శాఖల అధికారులతో పాటు డివిజన్ స్థాయి అధికారులు బదిలీల్లో భాగంగా ఇతర నియోజకవర్గాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కొత్తగా ప్రభుత్వం ఏర్పడటం పాత ప్రభుత్వ హయాంలో చేపట్టిన కార్యక్రమాలు, పథకాల్లో పనుల విషయంపై ఆరా తీస్తుండటంతో తమకు ఇబ్బందిగా మారే పరిస్థితి ఉండటంతో పలు మండలాలకు వెళ్లేందుకు మొగ్గుచూపడం లేదు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు కొంత మంది అధికారులను తమ నియోజకవర్గం పరిధిలోని మండలాలకు రావాలని కోరినా మొగ్గు చూపడటం లేదు. జిల్లాలో ఎన్నికల బదిలీతో పాటు కొత్త ప్రజాప్రతినిధుల సూచనల మేరకు ఎంత మంది అధికారులు బదిలీ కానున్నారో ఫిబ్రవరి 8లోపు తేలే అవకాశం ఉంది.

రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, జనవరి 19: జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల పోస్టర్లను శుక్రవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, ఆర్‌టీఏ వెంకటరమణలు ఆవిష్కరించారు. కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రోడ్డు భద్రతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తూ రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ట్రాఫిక్ రూల్స్‌ను పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నారు. సెల్‌ఫోన్ వాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని కలెక్టర్ తెలిపారు. ప్రయాణంలో విధిగా సీటుబెల్ట్ ధరించాలని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత ప్రమాణాలను పాటించాలన్నారు.

అవిశ్వాస సెగలు!







- జిల్లాలోని స్థానిక సంస్థల్లో పెరుగుతున్న అవిశ్వాసాల జోరు
- ఇప్పటికే ఆర్మూర్ మున్సిపల్ చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం
- జిల్లాలోని పలు సొసైటీల్లో అవిశ్వాసాలకు డైరెక్టర్ల నిర్ణయం

నిజామాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో అవిశ్వాసాల జోరు పెరుగుతోంది. మున్సిపాలిటీల్లో మొదలైన ఈ జోరు సహకార సంఘాలకు కూడా పాకుతోంది. కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో కొన్ని చోట్ల కాంగ్రెస్ నేతలు సహకార సంఘాలపై నజర్ పెట్టగా మరికొన్నిచోట్ల బీఆర్ఎస్ నేతలు ఈ అవిశ్వాస తీర్మానాలకు సిద్ధమవుతున్నారు. మున్సిపాలిటీలకు, సహకార సంఘాలకు ఇంకా సంవత్సరం పాటు సమయం ఉండటంతో ఛైర్మన్ల పదవులపై దృష్టిపెట్టి ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఆర్మూర్ మున్సిపాలిటీ ఛైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గగా ఇదే రీతిలో ఇతర మున్సిపాలిటీలో కూడా ప్రయత్నాలకు సన్నద్ధమవుతున్నారు. కొన్ని మండల ప్రజాపరిషత్ పదవులపైన కూడా నజర్ పెట్టి ప్రయత్నాలను చేస్తున్నారు.

కొత్త ప్రభుత్వంలో పెరిగిన జోరు

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడటంతో స్థానిక సంస్థల్లో అవిశ్వాసాల జోరు కొనసాగుతోంది. ప్రభుత్వం మారడంతో కొన్ని నియోజకవర్గాల పరిధిలోని కాంగ్రెస్ నేతలు ఈ ప్రయత్నాలను చేస్తున్నారు. మరికొన్ని చోట్ల బీఆర్ఎస్ నేతలే ఈ అవిశ్వాస తీర్మానాలకు మద్దతు ఇస్తున్నారు. జిల్లాలో ఉన్న నాలుగు మున్సిపాలిటీల ఛైర్మన్ల పదవీకాలం వచ్చే సంవత్సరం జనవరి వరకు ఉంది. సహకార సంఘాల ఛైర్మన్ల పదవీకాలం కూడా సంవత్సరం పాటు ఉంది. ఈ రెండింటిలో అవిశ్వాసాల జోరు కొనసాగుతోంది. జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు ఉండగా శాసనసభ ఎన్నికల ముందే బోధన్ మున్సిపల్ ఛైర్మన్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొంత మంది కౌన్సిలర్లు కూడా ఆమెతో పాటు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. శాసనసభ ఎన్నికల్లో ఛైర్మన్, పార్టీ మారిన కౌన్సిలర్లు కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఏర్పడటంతో వారి సీటుకు ఢోకా లేకుండా పోయింది. మిగతా కౌన్సిలర్లు కూడా కొంత మంది కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఛైర్మన్ కూడా పూర్తిస్థాయిలో పనిచేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆర్మూర్ మున్సిపల్ ఛైర్మన్ వినితాపండిత్‌పై సొంత బీఆర్ఎస్ కౌన్సిలర్లే అవిశ్వాసం తీర్మానం పెట్టారు. కౌన్సిలర్లు ఇచ్చిన నోటీసుకు అనుగుణంగా ఈనెల 4న కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించగా 24 మంది అవిశ్వాసానికి మద్దతు తెలపడంతో నెగ్గింది. ఛైర్మన్ పదవీ కోల్పోయింది. ఈ మున్సిపాలిటీలో కొత్త ఛైర్మన్‌ను ఎన్నుకోనున్నారు.

కాంగ్రెస్ నేతల నజర్

జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు నిజామాబాద్ కార్పొరేషన్, భీంగల్‌పై కూడా నజర్ పెట్టారు. ఈ రెండింటిలో కాంగ్రెస్ కార్పొరేటర్ల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. కొంత మంది కార్పొరేటర్లు పార్టీ మారితే అవిశ్వాసం పెట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. కార్పొరేషన్ పరిధిలో బీజేపీ కార్పొరేటర్లు ఎక్కువగా ఉండటం వల్ల అవకాశం తక్కువగా ఉండటంతో ప్రస్తుతం పరిస్థితులను అంచనా వేస్తున్నారు. మున్సిపాలిటీలలో మాదిరిగానే జిల్లాలోని సహకార సంఘాలలో అవిశ్వాసాల జోరు పెరిగింది.

అవిశ్వాసాలకు సిద్ధమవుతున్న డైరెక్టర్లు

జిల్లాలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోని డైరెక్టర్లు ఈ అవిశ్వాస తీర్మానాలకు సిద్ధమవుతున్నారు. కొన్నింటిలో ఇప్పటికే అవిశ్వాసం పేరుతో అధికారులకు నోటీసులను అందించారు. ప్రభుత్వం కూడా ఈ అవిశ్వాసాలు సహకరా సం ఘాల్లో ఎక్కువ అవుతుండటంతో రాష్ట్రస్థాయి నుంచి జిల్లా సహకార శాఖ అధికారికే బాధ్యతలను రెండు రోజుల క్రితం అప్పగించారు. జిల్లాలో ఇప్పటికే ఎని మిది సొసైటీల వరకు అవిశ్వాసం తీర్మానాలకు సిద్ధమయ్యాయి. కాంగ్రెస్ డైరెక్టర్లు ఉన్న సొసైటీలో ఎక్కు వగా ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉండటం వల్ల సొసైటీ తమ చేతికి వస్తే పనిచేసే అవకాశం ఉంటుందని వారు భావిస్తున్నారు. ఆ జిల్లాలో మొత్తం 89 సంఘాలు ఉండటం, సంవత్సరం పాటు ఇంకా అవకాశం ఉండటంతో కొన్ని సొసైటీల పరిధిలోని డైరెక్టర్లు ఈ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం మారినప్పుడు సొసైటీలోని ఛైర్మన్లు కూడా మారే అవకాశం ఉందని జిల్లాకు చెందిన నేతలు భావిస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు కొన్ని చోట్ల సొసైటీలు చేజారకుండా చూస్తుండగా మరికొన్ని చోట్ల పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ నేతలు మాత్రం తమ మండలాల పరిధిలో గట్టి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. ఈనెలాఖరులోపు మరి కొన్ని సొసైటీలో అవిశ్వాసాలు పెట్టేందుకు డైరెక్టర్లు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ అవిశ్వాసాల వల్ల కొంత మంది ఛైర్మన్లు పదవులు దక్కించుకునేందుకు భారీ ఎత్తున ఖర్చు పెడుతుండగా మరి కొంత మంది డైరెక్టర్లు ఛైర్మన్లుగా ఎన్నికయ్యేందుకు ఎక్కువ మొత్తంలోనే ఖర్చుకు సిద్ధమవుతున్నారు. సంవత్సరం కాలానికి పెట్టుబడి పెట్టే వారిని ఛైర్మన్‌గా ఎన్నుకునే అవకాశం కనిపిస్తోంది.



ఇంటి నిర్మాణానికి రూ.2 లక్షలు

- ఎంపీ ధర్మపురి అర్వింద్


ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

సిరికొండ, జనవరి 19: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో ఇంటిని నిర్మించుకునే వారికి కేంద్ర ప్రభుత్వం రెండు లక్షల నిధులు మంజూరు చేస్తుందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. మండలంలోని కొండపూర్‌లో శుక్రవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర సభకు ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై పలువురిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే గృహ నిర్మాణ పథకానికి కేంద్రం అమలు చేసే ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం నిధులను కలుపుతారని చెప్పారు. అలాగే ముద్ర రుణ పథకంలో యూనిట్‌ను బట్టి బ్యాంకులు పది లక్షల వరకు రుణాలు సమకూర్చుతున్నందున నిరుద్యోగులు ఉపయోగించుకోవాలన్నారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉజ్వల పథకంలో ఉచితంగా గ్యాస్ కనెక్షన్ మోదీ ప్రభుత్వం ఇవ్వడమే కాకుండా రీ ఫిలింగ్ చేసుకుంటే రూ.350 బ్యాంకు ఖాతాలో వేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్, ఎంపీడీవో లక్ష్మిప్రసాద్, మండల వైద్యాధికారి అరవింద్, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ రాజశేఖర్, ఏఈ అర్షద్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని శుద్ధి చేసిన ఎంపీ

ఈ నెల 22న అయోధ్యలో శ్రీరాముల వారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న నేపథ్యంలో బీజేపీ ఆలయాల శుద్ధి కార్యక్రమం చేపడుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం మండల కేంద్రానికి తొమ్మిది కిలోమీటర్ల దట్టమైన అడవిలోని లొంకరామలింగేశ్వర ఆలయాన్ని ఎంపీ ధర్మపురి అర్వింద్, పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ శుద్ధి చేశారు.

పాఠశాల విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

డొంకేశ్వర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో సీఎస్ఆర్ కార్యక్రమంలో ఎంపీ ధర్మపురి అర్వింద్ విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. భారత ప్రభుత్వ ఆయిల్, నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ ద్వారా సీఎస్ఆర్ నిధులు పార్లమెంట్ పరిధిలో రెండు కోట్లతో 30వేల బ్యాగులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. వీటిని ప్రభుత్వ పాఠశాలలో చదివే 1నుంచి 5వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. విద్యార్థుల సౌకర్యం కోసం తక్కువ బరువు, ఎక్కువ నాణ్యతతో బాగ్యలు తయారు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

29న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు

నిజామాబాద్ అర్బన్, జనవరి 19: ఈనెల 29న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్‌వీ దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించి ఈనెల 20న నోటిఫికేషన్ విడుదలవుతుందని అదేరోజు తల్లిదండ్రుల జాబితా పాఠశాలల్లో ప్రదర్శిస్తామన్నారు. 22న జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, 24న తుది జాబితా ప్రకటిస్తామన్నారు. 29న ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు ఎస్ఎంసీ సభ్యుల ఎన్నికలు, మధ్యాహ్నం 1.30 నుంచి ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎన్నిక, 2 నుంచి తొలి సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఛైర్మన్, వైస్ ఛైర్మన్‌తో సహా ఒక్కో తరగతి నుంచి ముగ్గురు ఎన్నికైన తల్లిదండ్రులు సభ్యులుగా ఉంటారని వీరితో పాటు మరో ఐదుగురు ఎక్స్ అఫిషియల్ సభ్యులు, ఇద్దరు కోఆప్టెడ్ సభ్యులు ఉంటారని, ప్రధానోపాధ్యాయుడు మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారన్నారు. 1 నుంచి 8వ తరగతిలోని విద్యార్థుల తల్లిదండ్రులే సభ్యులుగా ఉంటారని, 9, 10 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ కమిటీలో అవకాశం ఉండదన్నారు. 50 శాతం తల్లిదండ్రులు ఎన్నికలు నిర్వహించే సమావేశానికి హాజరు కావాలని చేతులెత్తే పద్ధతి, వాయిస్ ఓటు ద్వారా హెచ్ఎంలు ఎన్నికలు నిర్వహిస్తారన్నారు.

మార్కెట్ యార్డుకు అమ్మకానికి కొత్త పసుపు

ఖిల్లా, జనవరి19: జిల్లాకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం రైతులు కొత్త పసుపును అమ్మకానికి తీసుకువచ్చారు. మొదటిరోజు ఇద్దరు రైతులు సుమారు 30 క్వింటాల పసుపును తీసుకురాగా క్వింటాకు ధర రూ.10,200 పలికింది. ప్రతీయేడు జనవరి నుంచి జిల్లాతోపాటు జగిత్యాల, నిర్మల్, మహారాష్ట్రకు చెందిన రైతులు పండించిన పసుపును అమ్మకానికి తీసుకువస్తారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డుకు వచ్చిన పసుపును సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి వెంకటేశం, సెకండ్ గ్రేడ్ కార్యదర్శి విజయ్‌కిశోర్ సిబ్బందితో పసుపును పరిశీలించారు. రైతులు నాణ్యమైన పసుపు తెచ్చి మంచి ధర పొందాలని సూచించారు.

నగరంలో దొంగతనం

● 10 తులాల బంగారం, 2లక్షల నగదు అపహరణ

ఖిల్లా, జనవరి 19: నగరంలోని రెండో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల గాజుల్‌పేట్‌లో దొంగతనం జరిగిన ఘటన శుక్రవారం సాయంత్రం వెలుగు చూసింది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గాజుల్‌పేట్‌కు చెందిన బాధితుడు వాసుగౌడ్ ఈనెల 15న శబరిమలైకు బయల్దేరాడు. అతని భార్య బంధువుల ఇంటికి నిద్ర కోసం గురువారం వెళ్లింది. ఇంట్లో ఎవరు లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు ఇంటి వెనకవైపు నుంచి లోపలికి చొరబడి ఇంట్లో గల బీరువాను ధ్వంసం చేసి అందులోగల సుమారు 10 తులాల బంగారం, 2లక్షల నగదును అపహరించినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంటి ముందు గల గేటుకు వేసిన తాళం వేసినట్లుగానే ఉందని ఎవరికి అనుమానం రాకుండా దుండగులు వెనుక ఉన్న తలుపుతాళం పగలగొట్టి లోనికి చొరబడ్డారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ పేర్కొన్నారు.

వృద్ధురాలిని నమ్మించి బంగారం చోరీ

రెంజల్, జనవరి 19: మండలంలోని నీలా గ్రామానికి చెందిన అంబెం పోసాని అనే వృద్ధురాలికి గుర్తుతెలియని వ్యక్తి మాయమాటలు చెప్పి ఆమె చెవులకు ఉన్న బంగారు నగలు(నాగులు) తీసుకుని పరార్ అయ్యాడని ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. నీలా గ్రామానికి చెందిన అంబెం పోసాని ఉదయం ఇంటిముందు కూర్చుని ఉండగా గుర్తుతెలియని వ్యక్తి వచ్చి మాయమాటలు చెప్పి పింఛన్ ఇప్పిస్తామని నమ్మబలికి ఆమె చెవులకు ఉన్న బంగారు నగలను దాచుకోవాలని చెప్పి ఆ నగలను లాక్కొని వెళ్లిపోయ్యాడన్నారు. పోసాని గమనించి అరుపులు కేకలు వేసి స్థానికులకు విషయం చెప్పేలోగా వ్యక్తి పరారీ అయ్యాడని అన్నారు. స్థానికులు ఈ విషయాన్ని పోలీసులకు చేరడంతో విషయం తెలుసుకున్న బోధన్ రూరల్ సీఐ శ్రీనివాస్ రాజ్ సంఘటన స్థలానికి చేరుకుని వృద్ధురాలిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న సీసీ కెమెరాల ద్వారా ఘటనకు దారితీసిన వివరాలను ఎస్సై సేకరిస్తున్నారు. బాధితురాలు అంబెం పోసాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

5లక్షల విలువ గల ఆల్ఫ్రజోలం పట్టివేత

● ఇద్దరి అరెస్టు

సుభాష్‌నగర్, జనవరి 19: కల్తీకల్లులో కలిపే మత్తు పదార్థాన్ని ఎక్సైజ్ పోలీసులు పట్టుకొని ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్ తెలిపారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కామారెడ్డి పట్టణ శివారులో నిర్వహించిన తనిఖీల్లో కల్తీకల్లులో కలిపే ఆల్ప్రజోలం రవాణా చేస్తూ అమ్మకానికి పాల్పడుతుండగా కబిరె సాగర్‌గౌడ్, మెడుమల సాగర్‌గౌడ్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 900 గ్రాముల ఆల్ఫ్రజోలంను పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రెండు బైకులు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. వీటి విలువ సుమారు 5లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు వెంకటేశ్, స్వప్న, ఎస్సై రామ్‌కుమార్, సిబ్బంది శ్రీను, ప్రసాద్, ఉత్తమ్, భోజన్న, విష్ణు, అవినాశ్, రామ్‌బచ్చన్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్

ఆర్‌అండ్‌బీ, విద్యాశాఖ

అధికారుల పనితీరుపై ఆగ్రహం

- డబుల్ బెడ్‌రూమ్ బిల్లులు త్వరితగతిన చెల్లించాలి
- కోటగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు

కోటగిరి, జనవరి19: ఆర్‌అండ్‌బీ, విద్యాశాఖ అధికారుల తీరుపై ప్రజా ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కోటగిరి ఉమ్మడి మండలంలో పలు ప్రధాన రహదారులు అధ్వానంగా మారి కల్వర్టుల వద్ద రక్షణ గోడలు లేక ప్రాణాలుపోతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని మండలసభలో సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. కోటగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్ అధ్యక్షతన నిర్వహించారు. ఆర్‌అండ్‌బీ ఏఈ జీయన్ పనితీరుపై వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. పొతంగల్-మద్నూర్ రహదారి అధ్వానంగా మారిందని, రహదారి ప్యాచ్ వర్క్‌లను చేపట్టకపోవడంపై తీవ్రంగా మండిపడ్డారు. డోంగ్లీ మండలంలోని సిర్పూర్ బర్డర్ వరకు రహదారి నిర్మాణం పూర్తిన పొతంగల్ బర్డర్‌కు అనుసంధానం చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. పొతంగల్ మండలంలోని సుంకిని పాఠశాలను జిల్లా పరిషత్ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేసిన అధికారులు ఉపాధ్యాయులను నియమించకపోవడంపై ఎంపీటీసీ సాయిలు, సర్పంచ్ మాధవరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటేషన్‌పై ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్‌చేశారు. మండలంలో ఇసుక కొరతతో పలు ప్రగతి పనులు నిలిచిపోతున్నాయని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు పనులకు ఇసుకను కేటాయించాలని సభ్యులు కోరారు. ఈ విషయమై పొతంగల్ తహసీల్దార్ రమేష్ మాట్లాడుతూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధిత గ్రామ పంచాయతీ ద్వారా అనుమతి తీసుకొస్తే ఇసుకను తరలించేందుకు అనుమతిస్తామన్నారు. ఎత్తొండ గ్రామంలో అభివృద్ధి పనుల కోసం ఇసుక, మొరం కోసం డీడీలు చెల్లించినా ఇబ్బందులు తప్పడం లేదని ఎంపీటీసీ ఫారూఖ్ ఫిర్యాదుచేశారు. నిధులు లేక గ్రామ పంచాయతీలు ఇబ్బందులు పడుతుంటే మిషన్‌భగీరథ నీటిసరఫరా తమపై అదనపు భారం పడుతుందని, ఈ బాధ్యతను సంబంధిత శాఖ అధికారులే నిర్వహించాలని సర్పంచ్‌లు కోరారు. డబుల్ బెడ్ రూమ్ బిల్లుల పంపిణీ విషయంలో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కోటగిరి ఎంపీటీసీ కొట్టం మనోహర్ ఎంపీడీవో మనోహర్‌రెడ్డిని ప్రశ్నించారు. డబుల్ బెడ్‌రూమ్ బిల్లుల పంపిణీ తమ పరిధిలో లేదని, గృహ నిర్మాణ శాఖ అధికారులను సంప్రదించి బిల్లుల విషయమై వివరాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మనోహర్ రెడ్డి, తహసీలార్‌లు రమేష్, ప్రభాకర్, ఆయా శాఖల అధికారులు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో

నిజాంషుగర్స్ కార్మికుల వినతి



ప్రజావాణిలో పాల్గొన్న నిజాంషుగర్స్ కార్మికులు

బోధన్‌రూరల్, జనవరి19: హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో నిజాంషుగర్స్ కార్మికులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు ఉపేందర్ మాట్లాడుతూ నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ లే ఆఫ్ అయినప్పటి నుంచి కార్మికులకు రావాల్సిన వేతన బకాయిలు ఇప్పించాలని కోరారు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని ప్రభుత్వం పునరుద్ధరిస్తామని చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని మళ్లీ తెరిపిస్తే ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని అన్నారు. ఎనిమిదేళ్లుగా కార్మికులకు వేతనాలు లేక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బోధన్, మెదక్, మెట్‌పల్లి కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

టీయూ లైబ్రరీకి పుస్తకాల అందజేత

డిచ్‌పల్లి, జనవరి 19: తెలంగాణ విశ్వవిద్యాలయం ప్రధాన గ్రంథాలయానికి స్వర్గీయ పద్మశ్రీ సిరివెన్నెల సీతారామ శాస్త్రి సమగ్ర సాహిత్య పుస్తకాలను ఉత్తర అమెరిక తెలుగు సంఘం (టానా) పుస్తకాల ప్రచురణ గౌరవ సంపదకులు డా.తోటకూర ప్రసాద్, ఆయన తరపున డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ప్రొ.త్రివేణి, తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ. యాదగిరికి ఈ పుస్తకాలను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొ.ఆరతి, డీన్ ప్రొ.త్రివేణి, యూజీసీ డైరెక్టర్ ఆంజనేయులు, పీజీ అడ్మిషన్స్ డైరెక్టర్ సంపత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి'

బోధన్‌రూరల్, జనవరి19: రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషిచేస్తోందని బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్‌పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లను, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు అద్దంకి ఉషాన్, పబ్బ మురళీ, కృష్ణారావు, ప్రకాశం, సీతారాం, జ్ఞానేశ్వర్, సత్యనంద్, కోటేశ్వరరావు, అద్దంకి లింగయ్య, కౌన్సిలర్లు శరత్‌రెడ్డి, పిట్ల సత్యం, రిటైర్డ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రైలులో గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నవీపేట, జనవరి 19: నాగర్‌సోల్ నుంచి నర్సాపూర్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య వయసు గల వ్యక్తి మృతి చెందాడని రైల్వే హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ తెలిపారు. గురువారం రాత్రి 7గంటల సమయంలో బాసర రైల్వే స్టేషన్‌లో బాసర నుంచి రాజమండ్రి వెళ్లడానికి అతడు జనరల్ టికెట్ తీసుకుని రైలులో ప్రయాణించాడని తెలిపారు. శుక్రవారం ఉదయం రైలు కాజీపేట్ చేరగా సంబంధిత వ్యక్తి రైలులో మృతి చెందాడని, వెంటనే కాజీపేట రైల్వేపోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. మృతుడి వద్ద రైలు టికెట్ తప్ప ఎటువంటి ఆధారాలు లభించలేదని, అతని ఆచూకీ తెలిసినవారు కాజీపేట రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

అభంగపట్నం, అబ్బాపూర్(ఎం)లలో గ్రామసభలు

నవీపేట, జనవరి 19: మండలంలోని అభంగపట్నం, అబ్బాపూర్(ఎం)లలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. వికసిత్‌భారత్ సంకల్ప యాత్రకు సంబంధించిన గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీవో రామకృష్ణ, ఏపీఎం భూమేష్ గౌడ్, పంచాయతీ రాజ్ ఏఈ శ్రావణ్ కుమార్, తదితరులున్నారు.

పేకాట కేంద్రాలపై దాడులు

కోటగిరి, జనవరి19: మండలంలోని సుద్దులం తండా, కారేగాం గ్రామాల్లో పేకాటకేంద్రాలపై శుక్రవారం ఎస్సై సందీప్ దాడులు నిర్వహించారు. సుద్దులం తండాలో పేకాడుతున్న ఆరుగురిని పట్టుకుని రూ.6,320 సీజ్‌చేశామన్నారు. కారేగాంలో మరో ఆరుగురిని పట్టుకుని రూ.2,400 నగదును సీజ్ చేసి పేకాట రాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తీగల వాగుపై

బ్రిడ్జి నిర్మాణ పనుల ప్రారంభమెప్పుడో?

- వాగు వద్ద ప్రమాదకర మలుపులు, తరుచూ ప్రమాదాలు
- వంతెన నిర్మాణానికి రూ.3 కోట్ల నిధులు
- మంజూరై నెలలు గడుస్తున్నా ప్రారంభం కాని పనులు
- అప్పుడు.. ఇప్పుడు అంటూ కాలయాపన చేస్తున్న అధికారులు



ఏర్గట్లలోని తీగల వాగు

ఏర్గట్ల, జనవరి 19: మండల కేంద్రమైన ఏర్గట్ల శివారులో రెండు జిల్లాల సరిహద్దు జగిత్యాల జిల్లా మెట్‌పల్లి దారిలో తీగల వాగుపై హైలెవల్ వంతెన పనులకు నిధులు మంజూరైనా నేటికీ పనులు ప్రారంభించడం లేదు. ఫలితంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండలంలోని చుట్టుపక్క గ్రామాల ప్రజలు, నిర్మల్‌కు వెళ్లే ప్రయాణీకులు ఈ వాగు మీదుగా రోజు వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ వాగుపై పైపుల ద్వారా లోలెవల్ బ్రిడ్జి నిర్మించినప్పటికీ ప్రయాణీలకు కష్టాలు తప్పడం లేదు. వాగు వద్ద ప్రమాదకరమైన మలుపు ఉండటంతో దానితో ఎదురుగా వచ్చే వాహనాన్ని ప్రయాణికులు గమనించలేక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో ఈ వాగుపై వెళ్లాలంటే వాహనదారులు భయం భయంగా ప్రయాణం సాగిస్తున్నారు. ఈ లోలెవల్ బ్రిడ్జి సుమారు 100 మీటర్ల పొడవు, ఎత్తు తక్కువగా ఉండటంతో వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికే నీరు పై నుంచి ఉధృతంగా ప్రవహించడంతో వాహనదారులు తిరుగు ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. రైతులు పండించే పంటను ఇంటికి తీసుకెళ్ల లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పుష్కరాల సమయంలో డబుల్ రోడ్డుతోపాటు హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడంతో అది కలగానే మారింది. గ్రామంలోని ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని అప్పుడు మంత్రిగా ఉన్న వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆర్‌డీఎఫ్ అండ్ ఎఫ్‌డీఆర్ నుంచి రూ.3 కోట్ల 5లక్షల నిధులు మంజూరయ్యాయి. గతేడాది అక్టోబరులో వంతెన నిర్మాణానికి శంకుస్థాపన సైతం చేశారు. తర్వాత పనులు ముందుకు సాగలేదు. అధికారులు స్పందించి తీగల వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని, దీని వల్ల రెండు జిల్లాల సహరిహద్దు గ్రామాల ఇబ్బందులు తొలగిపోతాయని ప్రజలు కోరుతున్నారు.

రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తాం

- వినిత్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

రెండు జిల్లాల సరిహద్దు వద్ద గల తీగల వాగు హైలెవల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ పనులు చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నాం. మరో రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తాం.

ఆబ్కారీ అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

- ప్రజలు ఫిర్యాదు చేసినా పట్టించుకోరా.?
- పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు: ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

ఎడపల్లి, జనవరి19: గంజాయి, ఇతర మత్తు పదార్థాల వ్యాపారంపై స్థానిక ప్రజలు ఫిర్యాదుచేసినా ఆబ్కారీశాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆ శాఖ బోధన్ సీఐ, ఎస్సైలపై ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం ఎడపల్లి మండలంలో మాజీమంత్రి బోధన్ ఎమ్మెల్యే పర్యటించారు. కుర్నాపల్లి గ్రామంలోని పాఠశాలను పరిశీలించారు. రాణాకలాన్, కుర్నాపల్లి గ్రామాలలో గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయని, వీటిని అరికట్టాలని ఎక్సైజ్ అధికారులను హెచ్చరించారు. అంతకు ముందు జానకంపేట గ్రామశివారులో గల శ్రీలక్ష్మి నర్సింహస్వామి ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రాణాకలాన్ గ్రామానికి వెళ్లి గ్రామంలో నెలకొన్న సమస్యలపై గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించి విద్యార్థుల, పాఠశాల సిబ్బంది వివరాలను హెచ్‌ఎంని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల శాతం తక్కువగా ఉందని విద్యార్థుల శాతం పెంచాల్సిన బాధ్యత అదికారులదే అన్నారు. గ్రామానికి ఆర్టీసి బస్సును ప్రారంభించారు. మంగల్‌పాడ్ గ్రామంలోని బాలాత్రిపుర సుందరీ దేవి ఆలయం లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. ఎడపల్లి మండల కేంద్రంలో ఓ ఫంక్షన్ హాలులో ఆయన కార్యకర్తలతో సమావేశమయ్యారు. గ్రామంలోని ప్రజలకు వీధి లైట్లు, డ్రైనేజీ, త్రాగునీరు ఇతర ప్రజలకు అవసరమున్న సౌకర్యాలు అన్ని సక్రమంగా ఉండేట్లు చూడాలని పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్‌ను ఆదేశించారు. అనంతరం అంబం గ్రామంలోని గ్రామస్థులను ఆయన కలిసి గ్రామంలో నెలకొన్న సమస్యలపై ఆరా తీశారు. గ్రామస్థులు ఇండ్లు లేని వారికి ఇండ్లు కావాలని ఆయనను కోరారు. బ్రాహ్మణ్‌పల్లి గ్రామంలోని ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జైతాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించి విద్యార్థులను పాఠశాలలో ఉపాధ్యాయుల బోధన గురించి అడిగి తెలుసు కున్నారు. ఆయా గ్రామాల నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రిఫిల్‌లో మత్తు పదార్థాలు నింపి అమ్ముతున్నట్లు తెలిసిందని, పేకాట, బెల్టు షాపులు తదితర వాటిపై సంబంధిత అధికారులు ఉక్కుపాదం మోపి అణచివేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తాహెర్‌బిన్‌హందాన్, గడుగు గంగాధర్, అంతిరెడ్డి రాజిరెడ్డి, తాళ్ళ విజయ్ కుమార్ గౌడ్, రాధా కిషన్ గౌడ్, పులి శ్రీనివాస్, బిల్లా రామ్మోహన్, శంకర్ నాయుడు, బంజ కామప్ప, అదికారులు ఉన్నారు

సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలి: ఎమ్మెల్యే

బోధన్‌రూరల్: ఆరు గ్యారంటీల హామీలను తప్పకుండా అమలు చేస్తామని, నియోజకవర్గ ప్రజలు సమస్యలను తన దృష్టికి తేవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని అయేషా ఫంక్షన్ హాల్‌లో కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 269 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డి, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, మందర్న రవి, గణపతి రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు గడుగు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

అద్దె చెల్లించి దేవాలయాల అభివృద్ధికి తోడ్పడాలి

బోధన్‌రూరల్, జనవరి19: దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న దుకాణదారులు అద్దెలను సక్రమంగా చెల్లించి దేవాలయాల అభివృద్ధికి తోడ్పడాలని దేవాదాయ శాఖ పరిశీలకురాలు బి.కమల అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని మారుతి మందిరం, దుకాణ సముదాయంలోని షాప్‌నెం.1ను సీజ్‌చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుకాణ నిర్వాహకులు సక్రమంగా అద్దె చెల్లించకపోవడంతో నోటీసులు జారీ చేసినా స్పందించకపోవడంతో పోలీసు, రెవెన్యూ శాఖల సమక్షంలో దుకాణాన్ని సీజ్‌చేశామన్నారు. జిల్లాలోని దేవాదాయశాఖ ఆధీనంలో ఉన్న దుకాణదారులు తమ మడిగె అద్దెలను క్రమం తప్పకుండా చెల్లించి దేవాలయాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో దేవాదాయ కార్యనిర్వాహణాధికారి రవీందర్ గుప్త, రాములు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వరుణ్, ఆలయ అర్చకులు ప్రవీణ్ మహరాజ్ తదితరులు ఉన్నారు.



దేవాదాయ ఆధీనంలోని దుకాణాన్ని సీజ్ చేస్తున్న దృశ్యం

రాంపూర్ వీడీసీ సభ్యులపై కేసు

డిచ్‌పల్లి, జనవరి19: మండలంలోని రాంపూర్ గ్రామంలో ఆరుగురు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన షేర్‌ఖాన్ రాంపూర్‌లో చికెన్ సెంటర్ నిర్వహణకు వీడీసీ సభ్యులు తరుచూ అడ్డంకులు సృష్టించడంతో పోలీసులను ఆశ్రయించాడు. షేర్‌ఖాన్ ఫిర్యాదుతో రాజ్‌కుమార్, సుమన్, లింగం, రాజన్న, నరేశ్, రవిలపై కేసునమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. వీడీసీ సభ్యులు చట్టాన్నిచేతుల్లోకి తీసుకుంటే ఎంతటి వారైన ఉపేక్షించేది లేదని పేర్కొన్నారు.

పన్ను చెల్లింపులో ప్రభుత్వ సిబ్బంది ముందుండాలి

ధర్పల్లి, జనవరి 19: ఇంటి పన్నుల చెల్లింపుల్లో ప్రభుత్వ సిబ్బంది ముందుండి పన్నులను సకాలంలో చెల్లించాలని సర్పంచ్ ఆర్మూర్ పెద్దబాల్‌రాజ్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో ఇంటి పన్నుల బకాయిలకు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. గ్రామంలో 20శాతం మేర పన్నులు వసూలు అయ్యాయని, మార్చిలోపు 80శాతం పనులు వసూలే లక్ష్యంగా గ్రామస్తులు గామపంచాయతీ సిబ్బందికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో వీడీసీచైర్మన్ అర్గుల్ రాజేశ్వర్‌రెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్ రైతు ఉత్పత్తిదారుల సమావేశం

ముప్కాల్, జనవరి 19: బాల్కొండలోని సమాఖ్య కార్యాలయంలో బాల్కొండ, ముప్కాల్ మండలాల శ్రీరాంసాగర్ రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ఎదుట వీవోడీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథి ఏపీడీ మధుసూదన్‌లు పాల్గొన్నారు. నాగాపూర్‌లో పిండి గిర్ని ప్రారంభించినట్లు సభ్యులు తెలిపారు.

గల్ఫ్ నుంచి స్వగ్రామానికి చేరిన మృతదేహం

డిచ్‌పల్లి, జనవరి 19: మండలంలోని దూస్‌గాం గ్రామానికి చెందిన సురుకుంట్ల ప్రవీణ్‌కుమార్ (30) ఈనెల 2న సౌదీఅరేబియాలో విధులు నిర్వహిస్తూ నిచ్చెన పైనుంచి నేలపై పడి అక్కడిక్కడే మృతిచెందగా ఆయన మృతదేహం శుక్రవారం స్వగ్రామానికి చేరుకుంది. కంపెనీ యాజయాన్యంతోపాటు స్థానికులు ఇండియన్ ఎంబసీ ద్వారా సంప్రదింపులు చేయడంతో మృతదేహాన్ని పంపించారు. మృతుడి భార్య సమత, ఇద్దరు కుమార్తెలు, తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. కుటుంబ సభ్యులు సా యంతం ప్రవీణ్‌కుమార్ అంత్యక్రియలు నిర్వహించారు.

ఆర్మూర్‌లో ఆరేళ్ల బాలుడిపై కుక్కల దాడి



కుక్కల దాడిలో గాయపడ్డ బాలుడు

ఆర్మూర్‌టౌన్, జనవరి 19: మున్సిపల్ పరిధిలోని సుభాష్‌నగర్ ప్రాంతంలో తొండి హరిచరణ్ అనే ఆరేళ్ల బాలుడిపై కుక్కలు దాడిచేశాయి. శుక్రవారం ఇంటి పరిసరాలలో ఆడుకుంటున్న బాలుడు హరి చరణ్‌పై కుక్కలు దాడిచేయడంతో కాళ్లకు గాయాలయ్యాయి. గమనించి తల్లి దండ్రులు బాలుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని చికిత్స చేయించారు. కాలనీలలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయని, కట్టడి చేసేలా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

దొంగను పోలీసులకు పట్టించిన స్థానికులు

ఆర్మూర్‌టౌన్, జనవరి19: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రసన్నంజనేయ ఆలయం వద్ద ఓ దొంగను స్థానికులు పోలీసులకు పట్టించారు. గురువారం రాత్రి ప్రసన్నంజనేయ ఆలయంలోకి ప్రవేశిస్తున్న దొంగను స్థానికుడు రుద్ర మధుసూదన్ తన ఇంట్లో ఉన్న సీసీ పుటేజీలు చూసి పోలీసులకు సమాచారం అందించి దొంగను పట్టించారు. దీంతో కాలనీ వాసులు మధుసూదన్‌ను అభినందించారు.

రోడ్డును కబ్జా చేసిన వారిపై ఆర్డీవోకు ఫిర్యాదు

ఆర్మూర్‌టౌన్, జనవరి 19: మున్సిపల్ పరిధిలోని ఎన్‌టీఆర్‌కాలనీలో రోడ్డును కబ్జాచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం కాలనీ వాసులు ఆర్డీవో వినోద్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్‌టీఆర్ కాలనీలో రోడ్డును కబ్జాచేసుకొని ఇద్దరు వ్యక్తులు ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారని, వారిపై చట్టరీత్య చర్య తీసుకొని రోడ్డును కబ్జా కాకుండా చూడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు ఆల్గోట్ సత్యానారాయణ, శీను, శ్రావణ్, నరేందర్, రాజశ్రీ, మానస, అను పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆర్మూర్‌రూరల్, జనవరి 19: ఆర్మూర్‌లోని మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని నాహీదఫిర్దోస్ కోరారు. ఎంపీసీ, బైపీసీ కోర్సులు, 5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ తరగతిలో మొత్తం 80 సీట్లకు గాను 60సీట్లు ముస్లీం మైనారిటీలకు పది బీసీ, మూడు ఎస్టీ, ఐదు ఎస్సీ, రెండు ఓసీ ఉన్నాయని తెలిపారు. అదే విధంగా 6, 7, 8 తరగతులలో మిగిలిన మైనారిటీ సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఇంటర్‌లో 30బైపీసీ, 30ఎంపీసీ సీట్లు ఉన్నాయని బైపీసీలో ఐదు బీసీ, రెండు ఎస్సీ, రెండు ఎస్టీ, ఓసీలకు ఒక సీటు ఖాళీగా ఉందని దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

వంజరి సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

నిజామాబాద్ అర్బన్, జనవరి 19: తెలంగాణ రాష్ట్ర వంజరి సంఘం క్యాలెండర్‌ను శుక్రవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాస్టర్ శ్రీనివాస్, రాష్ట్ర ప్రతినిధులు కాలేరు శ్రీనివాస్, గోపాల్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు భూమయ్య, నగర అధ్యక్షుడు గంగాధర్, పాఠశాల కార్యదర్శి లడ్డూ నర్సయ్య, బోదుగం శ్రీను, తదితరులు ఉన్నారు.

రూ.25 కోట్లతో వంతెనల నిర్మాణం

- నియోజకవర్గంలోని పలు చోట్ల బ్రిడ్జి పనులకు శంకుస్థాపన
- వర్షాకాలంలోపు పనులు పూర్తి: ఎమ్మెల్యే భూపతిరెడ్డి



నడిపల్లిలో బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

డిచ్‌పల్లి, జనవరి19: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో రూ.25 కోట్లతో హైలెవెల్ వంతెనలను నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. ఈ పనులను వచ్చే వర్షకాలం లోపు పూర్తి చేసేల చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని నడిపల్లి శివారులో డిచ్‌పల్లి-నిజామాబాద్ రహదారిపై నాలుగు వరుసల హైలెవల్ వంతెన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. పాటితండా, లింగపూర్, గడ్కోల్, ఎల్లారెడ్డిపల్లి ప్రాంతాల్లో నిర్మించనున్న వంతెన నిర్మాణపనులు నాణ్యతతో చేపట్టాలని, అధికారులు ఎప్పటికప్పుడు పనులను పరిశీలించాలని ఆదేశించారు. ప్రజల మౌలిక అవసరాలు తీర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అన్నారు. ఎన్నికల హామీలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సు, ఆరోగ్యశ్రీ రూ.10 లక్షల పెంపు అమలు చేశామని తెలిపారు. శిలాఫలకంలో తనపేరుపై గులాబీ రంగు ఉండటంపై అధికారులను ప్రశ్నించారు. తక్షణమే ఆ రంగును మార్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, పార్టీ ప్రతినిధులు షాదుల్ల, కంచెట్టి గంగాధర్, శాంసన్, పిచ్చేశ్వరరావు, వాసుబాబు, మురారి, గడీల శ్రీరాములు, పొలసాని శ్రీనివాస్, మురళి, చిన్నొళ్ల నర్సయ్య, తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం..

ధర్పల్లి: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వాడి-ఒన్నాజిపేట గ్రామాల మధ్యగల హైలెవల్ బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. రూ.9 కోట్ల 50లక్షల తో ఈ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. హైలెవల్ బ్రిడ్జితో రాకపోకలకు సమస్యలు సమసిపోతాయని చెప్పారు. ఆరు గ్యారంటీలను వందరోజుల్లో అమలు చేస్తామన్నారు. రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాలో జమ అవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వాడి, ఒన్నాజిపేట్ గ్రామాల సర్పంచులు భాగవ్వ, భగవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బేల్దారి కృష్ణ, మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్ పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇందల్వాయి: మండలంలోని ధర్పల్లి రోడ్‌లోగల వెంగల్‌పాడ్, ఎల్లారెడ్డిపల్లి వాగులపై హైలెవల్ వంతెనకు ఎమ్మెల్యే భూపతిరెడ్డి శంకుస్థాపన చేశారు. వెంగల్‌పాడ్ వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు వాగుపై వంతెనకు రూ.7కోట్లు, ఎల్లారెడ్డిపల్లి వద్ద గల వంతెనను రూ.5కోట్లు మంజూరు అయ్యాయని, వీటికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సమక్షంలో తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన మైనార్టీ నాయకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆరుగ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తుందని అన్నారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు విసిగిపోయరని అన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఇమ్మడిగోపి, చింతల కిషన్, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ కొరట్‌పల్లి ఆనంద్, రాజేందర్, మోతిలాల్, గంగాధర్ పాల్గొన్నారు.

రైతులకు రుణ మాఫీ చేసి తీరుతాం..

సిరికొండ: రైతాంగానికి రూ.2లక్షల రుణమాఫీ చేసి తీరుతామని ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. గడ్కోల్ గ్రామంలో కప్పల వాగుపై రూ.12 కోట్ల నిధులతో నిర్మించే హై లెవల్ వంతెన నిర్మాణాకి ఎమ్మెల్యే భూపతి రెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ వాళ్లకు ఓపిక లేక అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వారి మాటలను నమ్మవద్దని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ దేవగౌడ్, ఎంపీటీసీ సభ్యులు గంగారాం, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బాస్కర్‌రెడ్డి, ఎర్రన్న, గడీల రాములు, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మామిడి రాములు, సభ్యులు నిమ్మల భాస్కర్, రమేష్, నవీన్, నరేష్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



వ్యవసాయ భూములను పరిశీలిస్తున్న అధికారులు

దేవాదాయ భూములను కాపాడాలి

- జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ

నిజామాబాద్‌రూరల్, జనవరి 19: దేవాలయాలకు సంబంధించిన భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిదని, ఆ భూములను కాపాడేందుకు అన్నిచర్యలు తీసుకుంటామని జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ తెలిపారు. శుక్రవారం ఆమె నిజామాబాద్ శివారులోని ఆలయ భూములను పరిశీలించి మాట్లాడారు. నగరంలోని పెద్దరాంమందిర్‌కు చెందిన భూములు నగర శివార్లలో ఉన్నాయని, వాటిలో కొందరు రైతులు కౌలుకు చేస్తున్నారని చెప్పారు. కౌలు డబ్బులు ఎప్పటికప్పుడు శాఖకు జమచేయాలని సూచించారు. దేవాలయానికి మొత్తం 213 ఎకరాల 10గుంటల భూమిని సర్వే చేయిస్తామని తెలిపారు. దేవాదాయ భూములు కౌలుకు తీసుకుని సంబంధించి డబ్బులు చెల్లించనివారు వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో వాటిని బహిరంగ వేలం ద్వారా కొత్తవారికి కేటాయిస్తామని హెచ్చరించారు. దేవాదాయ శాఖ ఉద్యోగుల విధి నిర్వహణకు అడ్డుపడినా, వారిపై దౌర్జన్యం చేసినా వారిపై చర్యలు తీసుకోనున్నట్లు సుప్రియ తెలిపారు.

మంత్రి పొన్నంను కలిసిన జిల్లా నాయకులు



పొన్నం ప్రభాకర్‌ను కలిసిన జిల్లా నాయకులు

నిజామాబాద్ అర్బన్, జనవరి 19: రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారిగా జిల్లాకు చెందిన సీనియర్ నాయకులు శేఖర్‌గౌడ్, భోజన్న, దయాకర్ గౌడ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీసీలకు సంబంధించిన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.

మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన జిల్లా నేతలు



మహేష్‌కుమార్‌గౌడ్, బల్మూరి వెంకట్‌ను కలిసిన నేతలు

నిజామాబాద్ అర్బన్, జనవరి 19: ఎమ్మెల్సీలుగా నామినేషన్ దాఖలు చేసిన టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్‌లను శుక్రవారం జిల్లాకు చెందిన నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్, సీఎల్‌పీ కార్యాలయాల్లో పలువురు నేతలు వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శరత్, పంచరెడ్డి చరణ్, నాగరాజు, సకినాల శివ, పంచరెడ్డి శంకర్, ప్రకాశ్, తదితరులు వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

డొంకేశ్వర్: డొంకేశ్వర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా, పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మారంపల్లి లిఫ్ట్‌చైర్మన్ బోజారెడ్డి, డీసీసీ వైస్‌చైర్మన్ దేగాం గంగారెడ్డి, దశాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు ఇందల్వాయి విద్యార్థిని ఎంపిక

ఇందల్వాయి, జనవరి 19: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలలో చదువుతున్న గౌతమి అనే విద్యార్థిని జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ శుక్రవారం తెలిపారు. అండర్-19 పోటీలో ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలు జనగామ, వరంగల్ జిల్లాల్లో కొనసాగుతాయని చెప్పారు. జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన గౌతమిని ఉపాధ్యాయ బృందం అభినందించారు.

19 నుంచి బాలికల దినోత్సవ వేడుకలు

నిజామాబాద్ అర్బన్, జనవరి19: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి 24 వరకు జాతీయ బాలికల దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి షేక్ రసూల్‌బీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24న జిల్లాస్థాయిలో బాలికల దినోత్సవ వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు.

నేటి నుంచి స్పెషల్ కంపెనీంగ్ డ్రైవ్: తహసీల్దార్

ముప్కాల్, జనవరి19: బాల్కొండలోని ఆయా గ్రామాల్లో శనివారం బూత్ లెవల్ అధికారులు పోలింగ్ స్టేషన్ నందు స్పెషల్ కంపెనీంగ్ డ్రైవ్ నిర్వహించాలని తహసీల్దార్ శ్రీధర్ సూచించారు. శుక్రవారం నిర్వహించిన బూత్‌లెవల్ అధికారులతో సమావేశంలో నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. శనివారం, ఆదివారం బూత్‌స్టేషన్‌లలో ఉండి 18ఏళ్లు నిండిన ప్రతీఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్



సమావేశానికి హాజరైన జడ్పీటీసీలు



నిరసన తెలుపుతున్న జడ్పీటీసీ గంగారాం

బడ్జెట్ కేటాయింపులపై జడ్పీలో చర్చ

- గృహలక్ష్మి కింద మంజూరైన ఇళ్లను పూర్తిచేయాలి
- పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయాలని సభ్యుల డిమాండ్

ఖిల్లా, జనవరి19: 2024-25 ఆర్థికసంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ కేటాయింపుల విషయంపై శుక్రవారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో వాడివేడి చర్చ సాగింది. జడ్పీచైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 15, 16వ ఆర్థిక సంఘం నిధులతోపాటు కేంద్రం నుంచి వివిధ గ్రాంట్ల రూపంలో సమకూరే నిధులు, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా అందనున్న నిధులు తదితర వాటి గురించి జడ్పీ సీఈవో గోవింద్ సభ్యులకు వివరించారు. ఈ నిధులతో చేపట్టాల్సిన పనుల వివరాలను తెలియజేశారు. వివరాలను ఈనెల 26వ తేదీలోపు సభ్యులు యాక్షన్ ప్లాన్ సమర్పించాలని జడ్పీసీఈవో తెలిపారు. ఈసందర్భంగా 15వ ఫైనాన్స్‌కు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌పై ఏకగ్రీవంగా తీర్మానించారు. నిబంధనలకు అనుగుణంగా గ్రామపంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు నిర్ణీత నిష్పత్తిలో నిధులు కేటాయించబడుతాయని అన్నారు. ఈ సందర్భంగా నిధుల కేటాయింపుపై సభ్యులు తమ అభిప్రాయాలను వెల్లడిస్తూ అన్ని ప్రాంతాలకు సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని తీర్మానించారు. అంతకుముందు పలు అంశాలను సభ్యులు ప్రస్తావిస్తూ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. రైతులకు యూరియా, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, నానో యూరియా వినియోగంపై విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలని జడ్పీటీసీ సుమనరెడ్డి సూచించారు. దీనిపై జిల్లా వ్యవసాయ అధికారి వాజీద్ హుస్సేన్ స్పందిస్తూ సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. నానోయూరియా వాడకంపై జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రైతుబంధు నిధులు ఈనెలాఖరులోగా రైతుల ఖాతాల్లో జమఅయ్యేలా చూడాలని, రైతు రుణమాఫీ విధి విధానాల ఖరారు విషయంపై ఉన్నతాధికారులను సంప్రదించాలని జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు జిల్లా వ్యవసాయ అధికారికి సూచించారు. రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఎత్తిపోతల పథకాల ద్వారా చెరువులు నింపాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు.

● పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా చర్యలు

10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక తరగతులను నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డీఈవో దుర్గాప్రసాద్‌కు సూచించారు. ఎడపల్లిలో 10వ తరగతి విద్యార్థులు జీరో శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారని వారికి ప్రత్యేక తరగతులు తీసుకొని ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని ఎడపల్లి జెడ్పీటీసీ రజిత అధికారికి సూచించారు. పాఠాలు సక్రమంగా చెప్పేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

● అభివృద్ధి పనులను ఆపొద్దు..

తమ మండలాల్లో ఇప్పటికే ప్రారంభానికి నోచుకోని, వివిధదశల్లో కొనసాగుతున్న పనులను అర్థాంతరంగా ఆపేస్తున్నారని పలువురు సభ్యులు సమావేశంలో ఆవేదన వెలిబుచ్చారు. సంబంధిత పనులను నిలిపివేయకుండా యధావిధిగా కొనసాగించేలా చూడాలని ప్రభుత్వానికి విన్నవిస్తూ మోర్తాడ్ ఎంపీపీ శ్రీనివాస్ తీర్మానాన్ని ప్రతిపాదించగా సభ్యులు అనుమతించారు. గృహలక్ష్మి పథకం కింద మంజూరైన ఇళ్ల పనులు నిలిచిపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారని వెంటనే ప్రభుత్వం స్పందించి వాటి పనులను పూర్తి చేయాలని నిరసన తెలుపుతూ మెండోరా జెడ్పీటీసీ గంగారాం హాల్‌లో నేలపై బైటాయించి నిరసన వ్యక్తంచేశారు. ఇందల్వాయి నుంచి ధర్పల్లి వరకు గల రోడ్ బాగు చేయాలని ఇందల్వాయి సభ్యురాలు సుమనారెడ్డి అధికారులను సూచించారు. అలాగే వర్నిచౌరస్తా నుంచి నాగారం వరకు ఫోర్‌లైన్ పనులు జరగడం లేదని దీనివల్ల నగరానికి రావడానికి తీవ్ర ట్రాఫిక్ సమస్య ఎదుర్కొంటున్నామని సమయం వృధా అవుతుందని చందూర్ జెడ్పీటీసీ అంబర్‌సింగ్ నాయక్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పనులను వెంటనే ప్రారంభించాలని తెలిపారు.

క్వింటా పసుపునకు రూ.15వేలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఆర్మూర్ రూరల్, జనవరి19: క్వింటా పసుపునకు రూ.15వేల, ఎర్రజొన్న క్వింటాకు రూ.4500 చెల్లించి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఏఐకేఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి వి.ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆర్మూర్‌లోని కుమార్‌నారాయణ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి దేవరాం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలు, వరంగల్ డిక్లరేషన్‌లో తెలంగాణ రైతులు పండించిన అన్ని రకాల పంటలను కొనుగోలు చేస్తామని, పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని వాగ్దానం చేశారన్నారు. పసుపు క్వింటాకు రూ.12వేలు ఇస్తామని, ఎర్రజొన్నలను ప్రభుత్వమే కొనుగోలుచేసి క్వింటాకు రూ.3500 ధర చెల్లిస్తుందని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. రైతుల పక్షాన రూ.15వేలు చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని, ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలన్నారు. అదే విధంగా వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారుల మోసాలను అరికట్టాలని, జిల్లాలో ఎన్ఎస్ఎఫ్, ఎన్‌సీఎస్ఎఫ్ ఫ్యాక్టరీలతోపాటు మెట్‌పల్లి, మెదక్ షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు సారా సురేష్, ఆర్మూర్ డివిజన్ నాయకులు యు.రాజన్న, గంగారాం, గంగాధర్, పాల్గొన్నారు.

రాస్తారోకోలో పాల్గొన్న 10 మందిపై కేసు నమోదు

నవీపేట, జనవరి19: మండలకేంద్రంలో గురువారం రాస్తారోకో నిర్వహించిన పది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ శుక్రవారం తెలిపారు. బెల్లుషాపులో మండల కేంద్రంలోని దర్యాపూర్‌కు చెందిన డాంకే సాయిలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం విధితమే. ఈ విషయంపై బాధిత కుటుంబ సభ్యులు, పలువురు బంధువులు అదేరోజు సాయంత్రం మండల కేంద్రంలోని ప్రధానరహదారిపై మృతదేహంతో సుమారు గంటపాటు రాస్తారోకో నిర్వహించడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారని ఆయన తెలిపారు. ఎవరైనా అకారణంగా రాస్తారోకోలు చేపట్టి ఇబ్బందులు కలిగిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్, జనవరి 19: నగర శివారులోని నాగారం వద్ద గల తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల, ఒకేషనల్ కళాశాలలో ప్రవేశాలకు ఎటువంటి రుసుము లేకుండా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రణవీర్‌రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. మైనార్టీలకు 70 శాతం, ఇతరులకు 30 శాతం ప్రవేశాలు కల్పిస్తామని, కళాశాలల్లో వృత్తివిద్యా కోర్సులు అందుబాటులో ఉన్నాయని మెడికల్ ల్యాబరేటరీ టెక్నాలజీలో 30 సీట్లు, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ కోర్సులో 40 సీట్లు ఉన్నాయని తెలిపారు. పాఠశాల స్థాయిలో 5వ తరగతిలో 80 సీట్లు, 6, 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామని వెల్లడించారు. ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా ముందుగా సంప్రదించిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 7995057949 నెంబర్‌ను సంప్రదించాలని ఈ సందర్భంగా కోరారు. ఫిబ్రవరి 6 దరఖాస్తులకు చివరి గడువని తెలిపారు.

రాష్ట్రానికి పెట్టుబడుల అంశంపై చర్చలో పాల్గొన్న జిల్లావాసి



రేవంత్‌రెడ్డితో కలిసి సమావేశంలో పాల్గొన్న సుధాకర్‌గౌడ్

నిజామాబాద్‌అర్బన్, జనవరి 19: సీఎం రేవంత్‌రెడ్డి యూకే పర్యటనలో భాగంగా శుక్రవారం యూకే పార్లమెంట్‌లో నిర్వహించిన సమావేశంలో జిల్లాకు చెందిన ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ యూకే ఉపాధ్యక్షుడు సుధాకర్ గౌడ్ పాల్గొన్నారు. తెలంగాణకు పెట్టుబడులు తీసుకువచ్చే విషయంలో సుధాకర్‌గౌడ్ చొరవచూపి యూకే పార్లమెంట్‌లో పార్లమెంట్ సభ్యులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి వివిధ రంగాల్లో పెట్టుబడుల విషయంపై చర్చించారు. సమావేశం ఏర్పాటు చేసిన సుధాకర్‌గౌడ్‌ను సీఎం ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో గంప వేణు గోపాల్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ముప్కాల్, జనవరి19: యాసంగి వరినాట్లు పూర్తిచేసుకున్న రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి మహేందర్‌రెడ్డి రైతులకు తెలిపారు. శుక్రవారం బాల్కొండలోని కిసాన్‌నగర్ గ్రామంలో పంట నమోదు, వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి నాటిన 15 రోజుల నుంచి 25 రోజుల మధ్య మొగిపురుగు నివారణకు కోరంత్ర నిల్‌ప్రోల్ గుళికలు నాలుగు కిలోలు ఒక ఎకరానికి, ఇమమెక్టిన్ బెంజయిట్ అలాగే కాపస్ హైడ్రోక్లోరైడ్ గుళికలు 3కిలోలు ఎకరానికి చల్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో, రైతులు పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో యువజన క్రీడా పోటీలు ప్రారంభం

నిజామాబాద్ అర్బన్, జనవరి19: ఏబీవీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, నేతాజి సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వివిధ పోటీలను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రారంభించారు. డిగ్రీ కళాశాలలకు క్రికెట్, కబడ్డీ, ఖోఖో, జూనియర్ కళాశాలలకు క్రికెట్, కబడ్డీ, ఖోఖో పోటీలను నిర్వహించనున్నారు. ఈనెల 21 వరకు పోటీలు జరుగనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ పూర్వ రాష్ట్ర అధ్యక్షులు రెంజర్ల నరేష్, సురేందర్‌రెడ్డి, దామ సునీల్, జగదీశ్, బాలకృష్ణ, పాల్గొన్నారు.

బ్రిడ్జి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



పనులను పరిశీలిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే

నిజామాబాద్ అర్బన్, జనవరి 19: నగరంలోని 11వ డివిజన్ వెంగల్‌రావు నగర్ కాలనీకి వెళ్లే మార్గమధ్యలో నూతనంగా నిర్మిస్తున్న నిజాం కెనాల్ బ్రిడ్జి పనులను శుక్రవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త అధికారులతో కలిసి పరిశీలించారు. త్వరితగతిన పనులను పూర్తిచేసి బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా తొందరగా పనులు పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పలు డివిజన్ల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు తీసుకురాగా త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. ఆయనవెంట ఫ్లోర్ లీడర్ స్రవంతిరెడ్డి, తదితరులు ఉన్నారు.

● శ్రీరామ పాదుకలు మోసిన ఎమ్మెల్యే

ఈనెల 7న అయోధ్యలో పూజ చేసిన శ్రీరాముని పాదుకలు చిలుకూరి శివాలయం అర్చకులు శ్రీరామదాసి సురేష్ ఆత్మరామ్ అయోధ్య నుంచి పాదయాత్రగా రాముని పాదుకలను తలపై మోస్తూ కొండగట్టుకు వెళ్తున్న సందర్భంగా నగరంలో ఆ బృందానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ స్వాగతం పలికారు. రాముల వారి పాదుకలను తలపై పెట్టుకొని మోశారు. శ్రీరాముని పాదుకలను మోయడం పూర్వజన్మ సుకృతమన్నారు.

● బీజేపీలో చేరిన పలువురు నాయకులు

37వ డివిజన్ మాజీ కార్పొరేటర్ సహదేవ్, ప్రముఖ న్యాయవాది తూల గంగాధర్ తదితరులు శుక్రవారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ధన్‌పాల్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.



మాట్లాడుతున్న జిల్లా అధికారి

తపాలా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

బోధన్‌రూరల్, జనవరి19: తపాలాశాఖ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తపాలాశాఖ జిల్లా అధికారి జనార్ధన్‌రెడ్డి అన్నారు. బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లోగల తపాల కార్యాలయం వద్ద భారత ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. తపాలాశాఖ అమలు చేస్తున్న పొదుపు పథకాలు, సీనియర్ సిటీజన్స్ స్కీం, సుకన్యసమృద్ధియోజన, కేవీపీ, మంత్లీ ఇన్‌కమ్ స్కీం, ప్రధాన మంత్రి జీవనజ్యోతి, సురక్షాబీమా యోజన, అటల్ పెన్షన్‌స్కీం పథకాలను ప్రజలకు వివరించారు. ఏడాదికి రూ.520తో పది లక్షల రూపాయల వరకు అమలయ్యే ప్రమాద బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బోధన్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ జి.వేణు, ఎస్‌పీఎంలు అయాజ్, లక్ష్మణ్, నందులాల్, శ్రీకాంత్, సునీల్, సూర్యకాంత్, రూపేష్, తపాల సిబ్బంది ఉన్నారు.

భవిత సెంటర్‌ను సందర్శించిన విద్యా సమన్వయకర్త

నందిపేట, జనవరి 19: మండల కేంద్రంలోని భవిత సెంటర్‌ను శుక్రవారం జిల్లా సహిత విద్యా సమన్వయకర్త శ్రీనివాస్‌రావు సందర్శించారు. దివ్యంగుల పిల్లలతో మాట్లాడారు. ఏవిధమైన శిక్షణ పొందుతున్నారని అడిగితెలుసుకున్నారు. ప్రతీ శుక్రవారం భవిత సెంటర్‌లో ఉచితంగా ఫిజియోథెరపి చేస్తారని, ఈ అవకాశాన్ని దివ్యంగులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాస్‌రావు కోరారు. ప్రతీ శుక్రవారం డాక్టర్ శ్రీనివాస్ ఫీజియోథెరపి చేయడానికి భవిత సెంటర్‌కు వస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రీసోర్స్ పర్సన్‌లు నాగేష్‌గౌడ్, సురేష్, దివ్యాంగుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.130	రూ.200	రూ. 220
వెన్‌కాబ్ (కిలో)	రూ.135	రూ.205	రూ. 225

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ. 63,950	రూ. 58,950	రూ.755

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : హనుమాన్ (9.40, 4.20, 4.20, 7.40, 10.00)

స్క్రీన్-2 : హనుమాన్ (హిందీ) (12.00, 10.00) గుంటూరు కారం (3.20), హనుమాన్ (తెలుగు) (6.40)

స్క్రీన్-3 : గుంటూరు కారం (11.40, 6.20, 9.40), కొత్తరంగుల ప్రపంచం (2.55)

స్క్రీన్-4 : నా సామిరంగ (12.40, 6.50, 10.00), సైంధవ్ (3.50)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : నా సామిరంగ (1.35, 4.35, 10.45), గుంటూరు కారం (7.40)

స్క్రీన్-2 : గుంటూరు కారం (10.25, 4.20, 10.30), సైంధవ్ (1.30, 7.30)

స్క్రీన్-3 : హనుమాన్ (10.30, 1.30, 4.30, 7.35, 10.35)

దేవి : హనుమాన్ (11.15, 2.15, 6.15, 9.15)

లలితమహల్: గుంటూరు కారం (11.15, 2.15, 6.15, 9.15)

నటరాజ్ : నా సామి రంగ (11.15, 2.15, 6.15, 9.15)

విజయ్ : సైంధవ్ (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్